# వాల్ పోస్టర్

పి. శశిధర్

సమ్మిరెడ్డి అదరాబాదరాగా వచ్చి షెడ్లో సైకిల్ పడేసి మ్యాన్-వే దిక్కు నడిచిండు. అయన మనసంతా అందోళనతో నిండివుంది.

బొగ్గు గని మ్యాన్-వే ఆఫీసుపక్క నోటీసు బోర్డు ముందు కార్మికులంతా గుమిగూడింద్రు. నాలుగు రోజులుగా నడుస్తున్న సమ్మెకు బాధ్యులని ఇద్దరు కార్మికులకు డిస్మిసల్ చార్జిషీట్లు ఇస్తున్నట్టుగా కంపెని అ నోటీసుబోర్డులో కాయిదం అంటించింది. దాంతో కార్మికుల్లో కలకలం రేగింది.

"ఈ దెబ్బతో సమ్మె ఫెయిలైతదా? దొంగ నా కొడుకులు తూట్లు పొడుస్తున్నరు. ఎట్లా? ఈ సమయంల అన్నే కనుక ఉంటెనా !" సమ్మిరెడ్డికి అన్న యాదికచ్చే వరకు గుబగుబాని దుఃఖం పొంగుకవచ్చింది. అన్నె నర్సన్నకూ తనకూ ఉన్న అనుబంధం యాదికచ్చింది. రైలు పట్టాల పక్కన- పిచ్చి తుమ్మల మధ్యన- దుమ్ములో అన్న గుండె- రక్తసిక్తమైన గుండె- పిట్టపిల్ల తీరుగ కొట్టుకుంటున్నట్టుగ....

సమ్మిరెడ్డికి అన్న మరణం యాదికచ్చేవరకు కడుపులోంచి దుఃఖం ఎత్తేసుకచ్చింది.

"ఏమున్నది గంగల కలుపుతరు." సీనియర్ కోల్‌ఫిల్లర్ రాజేశం మర్రికొమ్మల్లోకి చూస్తూ అన్నడు. అతని మాటలకు స్పందిస్తూ మరో కార్మికుడు "కలుపుడే కాదు— మన దాంట్లకెల్లి రోజొగన్ని గిట్లనే గొంతు కోరికి సంపుతరు" అన్నడు.

సమ్మిరెడ్డి చాటుగా కండ్లనీడు బొగ్గుపంచెతో తుడుచుకుని మ్యాన్-వే దిక్కు నడిచిండు. మ్యాన్-వే ఆఫీసులో క్లర్కు నాగయ్య "ఇంతాలస్యమాయె.మ్యా" అంటూ మస్టర్ వేసుకుని 'ఒకటీ, రెండూ,' అంటూ మస్టర్లు పడ్డవారిని లెక్కిస్తూ లెక్కచీటి తయారుచేస్తున్నడు.

"బాయంత (గని) ఉరుకులాడినట్లు ఏందో లావు లావు లెక్కచీటి తయారు చెయ్యబట్టివి" అంటూ రోజూ ఆలస్యంగానే వచ్చే ట్రామర్ మొగిలి మ్యాన్-వే కిటికీ ముందుకచ్చి చేతులు తిప్పిండు.

రైటరోసారి (క్లర్కు) మొగిలి మొఖంలకు చూసి "నడిపిసా నడుపకున్నా-నాకు తప్పదు కదనోయీ" అనుకుంట మొగిలి మస్టర్ వేసుకున్నడు.

సమ్మిరెడ్డి ఓసారి మొత్తం కార్మికుల దిక్కు చూసిండు.

మ్యాన్-వే ముందు (గని ముఖద్వారం) ఉన్న మర్రిచెట్టు గద్దెమీదా- యాప చెట్టు గద్దెమీదా- అల్ల నేరేడు చెట్టు గద్దెలమీదా చాలామంది కార్మికులు కూర్చున్నరు. ఎవరూ ల్యాంపులు కట్టుకోలేదు. తట్టలూ, చెమ్మసులు (షవల్సు) ఇతర పనిముట్లు తెచ్చుకోలేదు. గనిలో సపోర్టులు పెట్టే టింబరింగు కార్మికులు పరాచికాలాడుకుంట వాట్ల (కర్రల) మీద కూర్చున్నరు. మరికొందరు మజ్దూర్సు బండలమీద కూర్చుని సమ్మె ఏమవుతుందా అని చూస్తున్నరు.

నాలుగురోజుల క్రితం ఫిల్లర్సు కార్మికులకు సమయం అయిపోయినాక ఖాళీ టబ్బులు ఇచ్చింది కంపిని. సమయం అయిపోయింది కనుక న్యాయంగా తమకు జీతాలు కట్టివ్వాలని ఆ ఫిల్లర్సు కార్మికులు పైకి వచ్చేశారు. కంపిని ఇవ్వనంది. దాంతో నాలుగురోజుల క్రితం రెండోబదిలి- మధ్యాహ్నం- నుంచి సమ్మె మొదలైంది- సమ్మెకు బాధ్యులని ఇద్దరు కార్మికులకు డిస్మిసల్ చార్జిషీట్లను ఇష్యూ చెయ్యటంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది ఈరోజు.

సమ్మిరెడ్డి ఆ మందిలో అటూ ఇటూ కాలుగాలిన పిల్లికూన తీరుగ తిరిగిండు కాసేపు. ఆ తరువాత తన పైలు (జతపనివాడు) మల్లేశం కోసం అటూ ఇటూ మందిలో వెతుకుతున్నడు.

కోల్ కట్టరుగా పనిచేసే కాంగ్రేసు డెలిగేటు పిట్టల రాయపోశం- అతను కాండ్రకించి ఉమ్మివేసి "సీ తల్లి- ఒక్కరోజు మస్టర్ కోసం నాలుగు రోజులు సమ్మెచేసుడు నేనెక్కడ సూల్లేదు" అన్నడు. ఆ మాటలు విన్న అల్లం కొమురయ్య కొరకొరచూసి- మొఖం అటు తిప్పుకోని "ఎంటికలు నరుసంగనే అయిపెయిందా" అన్నడు. దాంతో రాయపోశంకు రేషమచ్చింది. కాని తన డెలిగేటు చాలుబాజి తనంతో

"ఎన్నడన్న సాధించిండ్రా అని అడుగుతాన" అన్నడు.

"సాధించుకోకపోతె సచ్చినట్టు దిగుమంటవ్" కొమురయ్య కోపంగా.

"ఇగగిట్ల నలుగురు నాలుగు దిక్కుల గుంజినంక ఏం సాధించుతమే పారా దుండ్రి" కోల్ ఫిల్లర్ శామల లస్మయ్య అనుకచ్చిండు.

657

దాంతో రాయపోశం "ఇప్పుడు ఎవలెటు గుంజిన్రే బాంచెన్! సాధించుండ్రి! ఎవరద్దన్నడు" అన్నడు.

"ఎవరద్దంటె ఎవడాగుతడు తియ్యుండ్రి- కడుపునొచ్చినోడు ఓమ బుక్కు-తడు" లస్మయ్య.

రాయపోశం మాటలు వింటుంటె సమ్మిరెడ్డికి మంటుకచ్చింది కని తమాయించు కున్నడు- ఇంతకుముందు అయితేనా- ఇటువంటి సమయాలల్ల ఒక్కొక్క డెలి గేటును ఊపికొట్టిండు- ఇప్పుడా ధైర్యంలేదు- ఇప్పుడా బలంలేదు- తానెందుకో వెన్నుపూసలేని మనిషిలాగ అయిపోయిండు- ఇన్నాళ్ళూ తనవెనుక వెయ్యి ఏనుగుల బలం తీరుగున్న అన్నను నేలకూల్చిండ్రిప్పుడు- ఊకుండ మనసొప్పదు- ముందుబడ చాతగాదు- ఆట్లా ద్వైదీభావంతో సమ్మిరెడ్డి మంథిలో అడికీడికి తిరుగుతున్నడు. ఎవరో పలకరిస్తున్నరు- ఎవరో ఏదో అడుగుతున్నరు- వినీవిననట్టుగా చూసీచూడ నట్టుగా తప్పుకు తప్పుకు తిరుగుతున్నడు.

"ఇన్రోజులు బుదుకుపిట్టల తీరుగ ఉరికినోళ్ళందరికి ఏమైందుర్ర" ఒక ముసలి కార్మికుడు అరిచిండు.

సమ్మిరెడ్డి తన పాదాల వైపుకు చూసుకుంటూ ఉండిపోయిండు. హాలర్ డ్రైవర్- కమ్యూనిష్ట్ డెలిగేటూ అయిన తాటూరి వెంకటి నేముకుంట నేముకుంట వచ్చి "పనిచేసుకుంట కొట్లాడుదాం- కాకపోతే కన్సిలేషన్ ఉండనే ఉండె" అన్నడు. ఆయన మాటమీదికెల్లి ఒక పడుచు కార్మికుడు "ఎవరూ ఎంకటి బావా! పురాగ నల్ల పూసవై పెయినవ్- దూటికి వత్తలెవ్వా బావా" అన్నడు. ఆ మాటల్లోని వ్యంగ్యానికి మనసులోనే నొచ్చుకుని, "అదెనోయి బామ్మర్ది రోజు రానేపత్తి" అని ఏడువలేక నవ్విండు. ఎందుకోగాని కొందరు కార్మికులు నవ్వారు. మరెవరు మాట్లాడలేదు. బాయిమీద ఊడికాడికి గద్దల తీరుగ డెలిగేట్లు కలె మెలుగుతున్నరు. మధ్యమధ్యలో వెళ్ళి మేనేజర్ను, ఏజెంటును కలిసివస్తున్నరు.

"ఎట్ల తిరుగుతాండ్రో సూడు- కొకుల గద్దలు కలెమెలిగినట్టు- ఖిన్న మొన్నటి మొన్నటిదాక ఎవనికి బాయిల మీదికి అచ్చే ధైర్యం లేదుకని- ఇయ్యాల గోసులు బిగిచ్చుకోని ఉరికురికి వస్తున్నరు బిడ్డలు" అన్నడు.

"పులిని పడగొట్టిండ్రే నాయిన పులిని పడగొట్టిండ్రు- నక్కలు రాజ్యం మీతి కచ్చినయి" అన్నడు మరో కార్మికుడు.

సమ్మిరెడ్డికి మనసు మనసులో లేదు-

658

దొంగ లంజా కొడుకుల్లార ఇదంతా అన్యాయం అనీ- చార్జిషీట్లు వాపస్ తీసుకోవాలని, కార్మికులకు న్యాయంగా రావాల్సిన జీతాలు కట్టివ్వాలని, అంతదాక సమ్మెను కొనసాగించాలనీ, గొంతెత్తి చెప్పాలని వుంది.

ఒకరిద్దరు డెలిగేట్లు సమ్మిరెడ్డిని కనిపెట్టి చూస్తూనే వున్నరు. సమ్మిరెడ్డి అందరి మొఖాలూ పులుకు పులుకున చూస్తూ తిరుగుతున్నడు. దూరంగ- ఉసికె కుప్పలమీద- అల్లరి అల్లరిగా వినిపిస్తున్న దిక్కు నడిచిండు సమ్మిరెడ్డి. అక్కడ అక్కడ బ్లాక్‌స్మిత్ (కమ్మరి) వీరయ్య ప్యాకెట్ల మీద ప్యాకెట్లు దంచివచ్చి రాగాలు తీస్తున్నడు.

"బంతిపూవులా దండలు తెచ్చిన, బామరో తలుపులు తీయవే" తన తొర్రి నోటితో పాడుతోంటె వినేవారికి కుక్క ఏడ్పులాగ తోస్తోంది. మజ్దూర్ మధు నెత్తి తువ్వాలను కొంగులాగ అడ్డం వేసుకుని "నే తీయజాలలేనూ, నీ మొఖము చూడలేనూ" అంటూ చెంచులక్ష్మిలాగ చింగిడిబింగిడి ఆడుతున్నడు.

చుట్టూచేరిన కార్మికులు నవ్వుతున్నరు- ఈలలు వేస్తున్నరు- చప్పట్లు చరుస్తున్నరు- నాట్యం చేస్తున్నరు- ఎవరో పాతటబ్బుపై మద్దెల వాయిస్తున్నారు.

"బాయి బందంటె ఎట్ల సంకలు గొడుతున్నరో సూడు" యేషన్ సక్కపోశం-

"చాతగానోనికి అద్దన్నోడే తల్లి దండ్రి" మరెవరో కలిపిండ్రు.

సమ్మిరెడ్డి నవ్వరాక నవ్విండు.

అంతలోనే బాయి ఆవరణలోకి బురబురలాడుతూ పోలీసు జీపు వచ్చింది. దున్నపోతులాగ బలిసిన సర్కిల్ చేతిలో రివాల్వర్ తిప్పుతూ విజయవిలాసంతో ముందుకు నడుస్తుండె-అతనికి కుడి ఎడమల-వెనుకపక్క ముగ్గురు పోలీసులు మూడు తుపాకులు పట్టుకుని కుక్కల తీరుగ బెదిరిబెదిరి చూస్తూ కార్మికుల దిక్కు నడుస్తున్నరు.

మేనేజరు ఎదురుపోయిండు 'నమస్తే' అన్నడు. సర్కిల్ తలాడించిండు.

"సూడంగ సూడంగ మనల్ని బాయిల మీదనే పిట్టపిల్లల తీరుగ కాల్చి చంపె టట్టున్నరు" అని ఒక ముసలి కార్మికుడు విచారించిండు. అందుకు ఒక పడుచు కార్మికుడు జవాబు చెబుదామనుకొని అటుపక్క ఇటుపక్క జాగ్రత్తగ చూసి, కొంచెం తమాయించుకుని "అంత సర్కిల్ కూడ ఎంత బయబడుతాందో సూడు"

659

అన్నడు. మొదట విచారించిన ముసలాయనె "ఔ ఇది కూడ నిజమేనోయి పిలడా" అని తలాడించింది.

సమ్మిరెడ్డికి సర్కిల్ కనిపించగానే పెయ్యిమీద రోమాలు లేచినిలబడ్డాయి. మనిషి గొంతు కొరికి నెత్తురు తాగివస్తున్న పులితీరుగ సర్కిల్- అతను అడుగుతీసి అడుగువేస్తుంటె కండలు ఊగుతున్నయి. మీసాలమీద చెయ్యివేసి కార్మికులనుద్దేశించి

"బాయి నడిపిస్తున్నరా లేదర్రా" అన్నడు. మందిలోంచి ఎవరో సన్నగా అబ్బ నీ కండలు కాలిపోను వారివారికి ఊగితివిగదరా" అని గొణిగిండు. అంతకు మించి మందిలోంచి ఎవరూ మాట్లాడలేదు. మూగన్నల తీరుగ పోలీసులను చూస్తూ నిలబడ్డరు.

"నోర్లు లెవ్వేరా ఎవనికి" చుట్టూ చూస్తూ అన్నడు, అయినా ఎవరూ నోరు మెదుపలేదు. అందరూ చూసేలా మరోసారి రివాల్వర్ ఎడమచేత్తో విలాసంగా తిప్పుతూ మేనేజరువైపు పోయాడు.

"పీడేకదా సర్వయ్యను చంపింది" ఎవరో రోషంగా గొణిగారు.

"హుష్ నోరుమూసుకో" మరెవరో కసిరారు.

వివిధ యూనియన్ల డెలిగేట్లు - అధికార్లూ - పోలీసులు ఆఫీసు గదులవైపు కదిలారు.

ఆ దృశ్యాన్ని చూస్తూ ఒక కార్మికుడు. "నాయకుడు లేని తండా, నవాబు లేని జండా అన్నట్టు-అయింది మన సంగతి" అని అన్నాడు.

చాలా మంది ఆ మాటలతో ఏకీభావం ప్రకటిస్తున్నట్టుగా మౌనం వహించారు. అట్లాగే ఎక్కడివారక్కడ దిక్కుతోచనట్టుగానే వుండిపోయారు.

అంతలోనే పసుపు రంగు అంగి తొడుక్కున్న డెలిగేటు ఒకడు గసపోస్తూ వచ్చి "హైదరాబాదుకు ఫోనిచ్చినం-ఎమ్మెల్యేసాబు బైలుదేరిండు-" అన్నడు.

"ఇగ అచ్చింది సూడు—అన్నట్టు" మందిలోంచి- "రాత్రివరకు రావాలె తెల్లారి ఏదో ఒకటి సెటిల్ అయిపోవాలె" అతనే దమ్ము తీసుకుని వివరించాడు. ఆ తరువాత ఆయన్నెవరూ పట్టించుకోలేదు. ఆయనతో పాటు మరో ఇద్దరు కార్మికులు దూరంగా జరిగి ఎమ్మెల్యేను తీసుకువచ్చి ఎట్లా లబ్ధిపొందుదామా అని ఆలోచిస్తున్నరు.

660

మల్లేశం వచ్చి-క్యాంటిన్లో కూర్చున్న సమ్మిరెడ్డి బుజం తట్టిండు

"అప్పట్నుంచి చూస్తున్న ఏడ తిరుగుతానవు" నవ్వుతూ అన్నడు మల్లేశం. "నేనూ నీకోసం చూసిచూసి ఈడికచ్చిపోతున్న" సమ్మిరెడ్డి మామూలుగానే జవాబిచ్చిండు. ఆ తరువాత మల్లేశం ముఖంలోకి చూసిండు. అతని ముఖంలో ఏ భావమూ కనిపించ లేదు. సమ్మిరెడ్డి చుట్టూ ఓమారు కలియచూసిండు. క్యాంటిన్లో కప్పులగలగల-మాటలూ-చాయ్ పూర్తిగ పలుచనౌతోందని ఎవరో కార్మికుడు-పేరు లేకుండా బూతులు తిడుతున్నడు. తిరిగి మల్లేశం ముఖంవైపు చూస్తూ-సమ్మిరెడ్డి "అయిపోనట్టే-అంతా అయిపోయినట్టే-సమ్మె ఫేలైనట్టే" అని గొణిగిండు మల్లేశం ఏమనలేదుగానీ ఎటో చూస్తూ ఉండిపోయిండు.

"నెల అయిపోయిందా- కండ్లల్ల మెరుస్తుండు" సమ్మిరెడ్డి టేబుల్ పైకి ముఖం వేళ్లాడేసిండు.

మల్లేశం అంతూపొంతూలేని ఆలోచనలతో వేగిపోతున్నడు.

'మరైతె ఎట్లా ? ఏంచేయడం ?'

× × ×

పొద్దు వాలిపోతోంది-బయట కార్మికులు ఇళ్ళదారి పట్టారు. సమ్మిరెడ్డి-మల్లేశూ సైకిళ్లు వేసుకుని మందిలోంచి బయటపడ్డారు.

ఒకరి వెనుక మరొకరు సైకిళ్లు తొక్కుకుంటూ పోతున్నరు. మెయిన్ స్టోర్ ముందునుంచి రైలు పట్టాల మీదికి వచ్చారు. ఇంజన్లు రాల్చిన చిట్టెం బూడిదపైనుంచి సైకిళ్లు నడుస్తున్నయి

పొద్దు పూర్తిగా మునిగింది. నెత్తురుతో తడిసిన నేలలాగ పడమటి ఆకాశం-దూరంగా, తలలు నరికి నిలిపిన మనుషుల మొండాల తీరుగ ఫ్యాక్టరీ పొగ గొట్టాలు-చివ్వున పైకి చిమ్ముతున్న రక్తంలాగ బుసబుసలాడుతున్న పొగ-

సమ్మిరెడ్డికి కళ్లు తిరిగినట్టు అనిపించింది. సైకిల్ రైలుపట్టాకు తాకి పడిపోయింది. కంకరరాళ్ళపై పడిపోయిన సమ్మిరెడ్డిని దబదబ వచ్చి హుస్సేన్ లేపాడు.

"ఏమైందన్నా" అంటూ ఆత్రంగా అడిగాడు. సమ్మిరెడ్డి మాట్లాడకుండా మల్లేశం ముఖంలకు చూస్తు నిలబడిపోయిండు. క్రమంగా ఆయన కండ్లలోంచి కన్నీరు రాలింది. మల్లేశం మరేం అడగలేదు. సమ్మిరెడ్డి ఏమీ చెప్పలేదు.

661

కుడి ప్రక్క మూరికి తుమ్మల మధ్యగా దారి-దారికి ఎడమ ప్రక్క మంగలి షాపు- ఆ షాపు ముందు దుమ్ములో కొట్టుకుంటున్న హృదయం - నెత్తురోడుతున్న హృదయం- మరుక్షణంలో నవ్వుతున్న నర్సన్న- మల్లేశుకు కూడా ఒక్కసారిగా కడుపులోంచి దుఃఖం పొంగుకచ్చింది. కాని ఏడవలేదు. నమ్మిరెడ్డిని ఓదార్చిండు.

"ఇట్ల బాధపడితె ఎట్లనే నమ్మన్న" ధైర్యం చెప్పిండు. నమ్మిరెడ్డి మనసు తేలిక అవడంకోసం మరేవో నాలుగు మాటలు మాట్లాడిండు. "రేపు డూటికి రాకపోయేవు" అని హెచ్చరించి తను పోవాల్సిన బస్తీవైపు సైకిల్ తిప్పిండు- నమ్మిరెడ్డి మనసు కూడదీసుకుంటూ ముందుకు-ఇంటిదారి పట్టిండు.

అప్పటికే చీకటి చిక్కగా పడుచుకుంది.

× × ×

సమ్మె అయిదోరోజు- నిన్నటి సమయమే-కార్మికులు ఎప్పటిమాదిరిగానే మ్యాన్-వేకిక్కు నడుస్తున్నరు- ఇద్దరులాల్చిలో వున్న రైటరు నాగయ్య కోపంతో అరుస్తున్నడు.

"పోస్టర్ తరువాత చదువుకుందురుగని ముందుగ మస్టర్సు చెప్పుండిరా మొగలార అవుతల మిందెడు అగుతలేడు" అంటూ కార్మికుల మస్టర్సు వేస్తున్నడు.

మ్యాన్-వే కిటికి ప్రక్కన ఎరుపు అక్షరాల్లో పోస్టర్ అతికించివున్నది.

కార్మికులు గుంపుగా ఆ పోస్టర్ చుట్టూ గుమిగూడారు. చాలామంది కార్మికులు కళ్ళతోనే చదువుకుంటున్నరు- మరికొందరు పెదిమలాడిస్తున్నరు. చదువురాని కార్మికులు మిగతావారి మొఖాల్లోకి చూస్తున్నరు.

"ఎవళకువాళ్ళే సదువుకోబట్టిరి- గందుకేనానో ఓసమ్ములన్నిందర్ని సదివించిండి." సీనియర్ కోతకట్టర్ రాజమ్మదు రొండ్లకు చేతులానించుకుని గట్టిగానే అన్నడు.

"సీయప్పసిపోతడ కాలిపోనూ" మరో కార్మికుడు- ఎర్రతేలు లాంటి ఫ్లోటింగ్ బదిలీఫిల్లర్ (కేజువల్ వర్కర్) బీక్యా రాజమ్మదు దిక్కు తిరిగి "పోష్టరేసింద్రు" అన్నడు.

"సరేనోయి మనుమడా ! ఎవరేసింద్రు ? ఏమనేసింద్రు" రాజమ్మదు "అన్న లేసింద్రు" బీక్యా చెప్పిండు. అందాకవింటున్న మరో కార్మికుడు "చెయ్యిమనా వద్దనా" అని సందేహంగా అడిగిండు- రాజమ్మదు కనుబొమలు పైకెత్తి "ఎవల దూటి వాళ్ల చేసుకోండ్రని" అన్నడు.

"అన్నలు గడ్లెత్తారు!" అతను నమ్మలేదు. రాజమ్మదు ఆ కార్మికుని భుజం మీద పరాచికంగ ఒక్క చరుపు చరిచిండు.

"కొట్లాడుమనకపోతె అన్నలు వద్దంటారో" అన్నడు. అతను నైజాం కాలపు సంగతులూ, రజాకార్లు, కమ్యూనిష్టోళ్ళ గురించి సందర్భం వచ్చినప్పుడల్లా చెబుతూ వుంటాడు.

కార్మికుల్లో ఆ పోస్టర్ పెద్ద సంచలనం రేపింది. ఇంతా చేస్తే మళ్ళీ పోస్టరెట్లా పడ్డది అని డెలిగేట్లు నోళ్లు వెళ్ళబెట్టి చూస్తున్నరు. వీళ్ళలో కొంచెం భయం మళ్ళీ ప్రారంభమైంది. బాయినడుపుదాం అనే ధైర్యం అడుగంటింది. యాజమాన్యం మళ్ళీ మవునం వహించింది.

సమ్మిరెడ్డి ఆశ్చర్యానికి అంతులేదు. మళ్లా ఎవరైన అన్న వచ్చిండా? వస్తె తమకు తెలియదా? మరెట్లా? మొత్తంమీద చాలా హుషారు వచ్చింది.

"కొత్త యూనియన్లను తరిమికొట్టండి-
కార్మికులకు ఇష్యూచేసిన చార్జిషీట్లు వాపస్ తీసుకోవాలి-
కార్మికుల సమ్మెకాలానికి కూడా వేతనం కట్టివ్వాలి?
సమ్మె కొనసాగించండి-" అంటూ ఒక కార్మికుడు గట్టిగా చదువుతున్నాడు.

ముఖం ముడుచుకుపోయిన సర్కిల్, తెల్లగా వాడిపోయిన మొఖపు మేనేజరూ- ఇద్దరూ ఆఫీసు గదిలోంచి బయటకు వచ్చేసరికి అధికార పార్టీ ఎమ్మెల్యే అట్టహాసంగ బీరపువ్వురంగు వేషంలో కారు దిగిండు. అయనతోపాటు కొత్త బిచ్చగాళ్ళ తీరుగ మరో ఇద్దరు లీడర్లు దిగిండ్రు

"అత్తాండు సూడో నప్పతట్ల ముండకొడుకు" అని గుంపులోంచి ఎవరో అన్నారు.

"మజ్దూరుగున్నప్పుడు పీరీల కట్టె తీరుగుండెటోడు".

"ఎమ్మెల్లే అయినంక బొత్త పెరిగింది కొడుక్కు".

"అప్పుడు జీతం దొరుకంగనే కొడుకు సారాదంచి ఏనుగుల్ల వీడే, బూడిది కుప్పల్ల వీడే- అచ్చోలేని ఇదర్ పూర్తిగ మారినట్టున్నడి".

కార్మికులు తలా ఒక రకంగా కామెంట్లు చేశారు. చుట్టూ అనుచరగణం కదులగా డాంబికంగా నడుస్తూ వచ్చిన ఎమ్మెల్యే కార్మికుల ముందుకువచ్చి ఆగిండు.

"సోదరులారా! నేను అసెంబ్లీ జరుగుతుంటె నడుమనే లేసి రావాల్సి వచ్చింది. వస్తున్నప్పుడు అన్నగారికి చెప్పే వస్తున్న.

663

కంపెని మెడలు వంచి పష్టర్ఫు తీసుకుందాం...." "అబ్బో నీ బాంచెన్" మందిలోంచి ఎవరో.

"అవసరంబడితె హైకోర్టుదాకాపోదాం".

"అన్నుండగ మళ్ళ హైకోరుకెందుకోవాయీ" మరెవరో తీకునం తీశారు.

"మీరు బాయిసదుపుండ్రి- కేసును అన్నదాక తీసుకపోదాం- అన్న లేబర్ మినిష్టర్‌తోని మాట్లాడి...." "గాపిత్తు ముందే పిత్తుతెగాదా ముందుగ బాయినడు పల్నటబాయి" కార్మికుల్లోంచి కోపంగా ఎవరో-

ఎమ్మెల్యేకు మాటలు వినిపించేయి కాని మనిషి కనిపించలేదు. అటు మేనేజి మెంటుకూ ఇటు కార్మికులకూ చెప్పిచెప్పి జగ్గెడన్ని మంచినీళ్ళు తాగిండు ఎమ్మెల్యే- హైద్రాబాద్ నుంచి ఫోనొచ్చిందని మళ్ళా కారెక్కిండు. కార్మికులు నవ్వుతున్నరు. "ఎందుకచ్చినట్టు ఎందుకు పోయినట్టు వీడు" ఒకాయన ఆశ్చర్యంలో మునిగిండు.

తరువాత కార్మికులంతా కూడబలుక్కున్నట్టుగా బిలబిలలాడుతూ సైకిల్ షెడ్డు వైపు కదిలారు-

సమ్మిరెడ్డి మల్లేశు చేయి దొరుకబుచ్చుకొని 'పోష్టర్ చూసినవా' అన్నట్టుగ చూసిండు మల్లేశు 'చూసిన' అన్నట్టుగ తలాడించిండు సమ్మిరెడ్డి మరేదో అడుగ బోయిండు. మల్లేశు సమ్మిరెడ్డి చెయ్యి గట్టిగా నొక్కిండు వద్దని.

ఉత్సాహంగా ముచ్చెట్లు బెడుతూ కార్మికులు కదులుతున్నరు. ఆ మందిలోంచి కాస్తా బయటకు వచ్చినంక సమ్మిరెడ్డి మల్లేశుతో అన్నాడు.

"మనకు తెలువకుంట-ఇక్కడికి ఎవరన్న అన్న అచ్చిండంటవా"

మల్లేశు ముసిముసిగా నవ్విండు.

సమ్మిరెడ్డి కనుబొమలు ముడివేసి మల్లేశు మొఖంలకు చూసిండు.

"నేనే రాసుకచ్చి ఏసిన" మల్లేశు.

సమ్మిరెడ్డి నోరెళ్ళబెట్టిండు. తిరిగి మల్లేశు చెప్పకచ్చిండు. "మొన్నటినుంచి మనుసు మనుసులలేదు. నువ్వు బైటికి కనిపిచ్చినప్‌గాని నాకు నీ తీరుగనే లోపల అంత ఎట్లనో అనిపిచ్చింది.

ఎటు చూసినా ఏ దారి కనిపియ్యకపాయె. ఇగ అన్నుంటె ఏంజేసెటోడు అని ఆలోచన చేసిన. గంతే! నిన్న పోతపోత బజారుకుపోయి కాయితాలు తెచ్చి రాసి, రాత్రి బడిలికి అచ్చినట్టు అచ్చి అతికిచ్చిపోయిన. →

664

చైనీస్ కథ :

## తామరమడుగు

సున్‌లీ

మబ్బులేని ఆకాశంలో మచ్చలేని చంద్రవంక చల్లగా వెలుగుతూంది. పిండారబోసినట్టున్న వెన్నెల్లో చక్కగా వూడ్చిన వాకిలి అద్దంలా మెరిసిపోతూంది. అది 1940 ఎండాకాలం. ఆ పగలే చీరిన తుంగ పరకలు పదునుగా మెత్తగా వాకిట్లో ఓ వార అల్లకానికి సిద్ధంగా ఉన్నాయి. ఒద్దిగ్గా పోగుపెట్టారు.

ముంగిట్లో కూచున్న ఓ అక్క పొడుగాటి వేళ్ళు చకాచకా తిప్పుతూ తుంగ పరకల్ని గబాగబా జడలా అల్లుతూంది. సుతిమెత్తని తుంగపోయలు వయ్యారంగా ఆమె చేతుల్లో పడి తిరుగుతూ అందంగా హత్తుకుపోతున్నాయి.

బియాంగ్డిన్ సరస్సు హూపె రాష్ట్రం నడుమ ఉంటుంది. అక్కడి తుంగ, రెల్లు చైనా అంతటా పెద్ద పేరు మోసినవి. అవి ఏయే వూళ్ళలో పెందుగారో సాలు మొత్తం మీద ఎంత దొరుకుతుందో ఆ వివరాలు నేను ఖచ్చితంగా చెప్పలేను. కాని ఏటేటా ఆరెల్లు పూత వెల్లి విరిసి రేకులు బంగారు రంగుకు తిరగ్గానే కోసి ఒడ్డున కుప్పలు పెడితే అదో పెద్ద "గ్రేట్ వాల్" లాగా కనబడుతుందని మాత్రం అంటారు.

---

→ —తప్పో! ఒప్పో! అన్నలు కలిసినంక 'శెనార్తి' అంట" మల్లేశు చెప్పుకచ్చిండు.

సమ్మిరెడ్డి మల్లేశును కావలించుకున్నడు. "తప్పెట్ల అయిద్ది? నీ తీరుగనే నేనూ, బాలయ్య కడుమోళ్ళందరం తండ్లాడుతున్నం గద- ఒక్కముచ్చట గిట్లగిట్ల అంటె అందరం కలిసే చేద్దుం కదా" అన్నడు సమ్మిరెడ్డి.

"తోసలేదు. ఇగముందు గట్లనే చేద్దాం" మల్లేశు అన్నడు.

సమ్మిరెడ్డి మల్లేశు చేయి గట్టిగా నొక్కివిడిచిండు.

షెడ్లోంచి సైకిళ్ళు తీసిండ్రు

తారు రోడ్డుమీద సైకిల్ చక్రాలు జరజర జారిపోతున్నయి. వాళ్ళిద్దరిని ఏదో ఉద్వేగం ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

(అమరుడు కామ్రేడ్ మేకల నర్సయ్య స్మృతిలో)